నమస్తే తెలంగాణ
# సూర్యాపేట
5 | నల్లగొండ, బుధవారం 18 డిసెంబర్ 2024 | SURYAPET



మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డిని కలిసిన సూర్యాపేట పారిశుధ్య కార్మికులు

## పారిశుధ్య కార్మికులకు మాజీ మంత్రుల భరోసా

- కేటీఆర్, జగదీశ్‌రెడ్డిని కలిసి సమస్యలు ఏకరవు పెట్టిన సూర్యాపేట కార్మికులు
- అసెంబ్లీలో పోరాడుతామని హామీ ఇచ్చిన మాజీ మంత్రులు

సూర్యాపేట టౌన్/ నకిరేకల్, డిసెంబర్ 17 : సూర్యాపేట మున్సిపాలిటీకి చెందిన పారిశుధ్య కార్మికులు మున్సిపల్ శాఖ మాజీ మంత్రి కేటీఆర్, జిల్లా మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వెంపటి గురూజీ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రం మూడేండ్ల కింద కిందట 30శాతం పీఆర్సీని పెంచిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సరం అయినా కార్మికులకు వేతనాలు పెంచలేదని వాపోయారు. నెలల తరబడి పీఎఫ్, ఈఎస్ఐను కార్మికుల ఖాతాలో జమ చేయడం లేదని తెలిపారు. సమస్యలపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కమిషనర్ స్పందించడం లేదని పేర్కొన్నారు. గతంలో పోరాడి సాధించుకున్న క్యాజువల్ లీవ్స్ అమలు కావడం లేదని, కార్మికులపై అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని వాపోయారు. ఈ సమస్యల పరిష్కారంతోపాటు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇప్పించేందుకు కృషి చేయాలని కోరారు. మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి స్పందిస్తూ కార్మికులకు న్యాయం జరిగేలా అసెంబ్లీలో పోరాటం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలోబీఆర్‌టీయూ మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్, బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ, వేముల మారయ్య, గురూజీ, వెంకట్రాది, సోమయ్య, భిక్షం, గంధమల్ల మల్లేశ్, ప్రసాద్ కృష్ణ, ప్రవీణ్, దేవీప్రసాద్, సంపత్,యాదగిరి, శ్రీను, నాగేశ్వరావు ఉన్నారు. సూర్యాపేట మున్సిపల్ కార్మికుల సోమయ్య, వెంకటాద్రి పాల్గొన్నారు.

## నిరుపేదలకు నాణ్యమైన విద్య ఘనత కేసీఆర్‌దే

- గురుకులాలతో మంచి చదువు, ఆహారం
- కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ నిర్వీర్యం
- బలోపేతానికి నిర్మాణాత్మక చర్యలు అవసరం
- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



శాసన మండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా, డిసెంబర్ 17 : దేశంలో ఎవరూ ఊహించని విధంగా రాష్ట్రంలో గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో అధ్వానంగా మారిన ప్రభుత్వ విద్యా సంస్థల పరిస్థితిపై మంగళవారం శాసన మండలిలో ఆయన మాట్లారు. సర్కారు అసమర్థత వల్ల ప్రభుత్వ విద్యా వ్యవస్థ నిర్వీర్యమవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రోజురోజుకూ మూతపడుతున్న ప్రభుత్వ పాఠశాలల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, హాజరు శాతం గణనీయంగా పడిపోతున్నదని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన చదువు, భోజనం అందించిందని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రాథమిక స్థాయి నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధనను ప్రవేశ పెట్టిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాలని కోరారు.

## రైతులు సంఘటిత శక్తిగా లాభాలు పొందాలి



రైతు ఉత్పత్తిదారుల సంఘంలో నిమ్మ గ్రేడింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

కట్టంగూర్, డిసెంబర్ 17 : రైతులు సంఘటితంగా ఉండి వ్యవసాయ రంగంలో మంచి లాభాలు పొందాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకాంక్షించారు. మండలంలోని అయిటిపాముల గ్రామ పంచాయతీ పరిధిలో గల గంగాదేవిగూడెంలో ఉన్న రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా యూరియా, ఎరువుల నిల్వ, అమ్మకాలు, నిమ్మ స్టోరేజీ యూనిట్, ప్రాసెసింగ్ యూనిట్, సోలార్ డ్రయ్యర్లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ దళారుల ప్రమేయం లేకుండా పండించిన పంటలను ఎఫ్‌పీఓలో విక్రయించి లాభాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్, ఉద్యానవన అధికారి సాయిబాబా, నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్, ఎఫ్‌పీఓ సలహాదారుడు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, ఎఫ్‌పీఓ చైర్మన్ సైదమ్మ, వ్యవసాయాధికారి గిరిప్రసాద్, ఐఆర్‌డీఎస్ ఎన్‌జీఓ వాడపల్లి రమేశ్ పాల్గొన్నారు.

## టీజీఐసెట్ నిర్వహణ ఎంజీయూకే..

- కన్వీనర్‌గా ప్రొఫెసర్ అల్వాల రవి

రామగిరి, డిసెంబర్ 17 : తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీజీఐసెట్-2025) నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ఉన్నత విద్యామండలి నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీకి అప్పగించింది. కన్వీనర్‌గా ఎంజీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్, ప్రస్తుత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవిని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంజీయూ ఆధ్వర్యంలో ఇప్పటికే టీజీపీఎస్‌సెట్, టీజీఎడ్‌సెట్‌ను విజయవంతంగా తాజాగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి టీజీఐసెట్ నిర్వహించే టీజీఐసెట్ బాధ్యతలనూ అప్పగించింది. వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌తో పాటు రిజిస్ట్రార్ రవికి పలువురు అభినందలు తెలిపారు. తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల్లో కంటే పూర్తి స్థాయిలో బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సులో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఇక్కడే ఉండడం గమనార్హం.



ప్రొ॥ అల్వాల రవి



నల్లగొండలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ శ్రేణులు



నకిరేకల్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్‌ఎస్ నాయకులు

# లగచర్ల రైతులకు అండగా...

## ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ నిరసన

- బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు
- మాజీ ఎమ్మెల్యేల నేతృత్వంలో కదం తొక్కిన శ్రేణులు
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు
- లగచర్ల రైతులపై అక్రమ కేసులు ఎత్తివేసి విడుదల చేయాలని డిమాండ్

నల్లగొండ ప్రతినిధి/ సూర్యాపేట, డిసెంబర్17 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వ దాష్టీకానికి గురైన లగచర్ల రైతులకు అండగా ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణులు కదం తొక్కాయి. వారిపై అక్రమంగా కేసులు పెట్టి, థర్డ్ డిగ్రీ ప్రయోగించి, జైలులో నిర్బంధిచడాన్ని తీవ్రంగా ఖండిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం వినూత్నరీతిలో నిరసనకు దిగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాలతోపాటు పలు మండలాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు ఎక్కడికక్కడ వినతిపత్రాలు సమర్పించాయి. లగచర్ల రైతులపై అక్రమ కేసులను ఎత్తివేస్తూ వెంటనే జైళ్ల నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశాయి. దేవరకొండలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ నేతృత్వంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కదిలారు. స్థానికంగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డితోపాటు ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆ పార్టీ నేతలంతా పాల్గొన్నారు. డీఈఓ కార్యాలయం ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లగచర్ల రైతులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నేతృత్వంలో జరిగిన నిరసనలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున భాగస్వాములు అయ్యారు. 'రైతు వ్యతిరేక ప్రభుత్వం నశించాలి.. లగచర్ల రైతులను భేషరుతుగా విడుదల చేయాలి' అంటూ నినదిస్తూ బాబాసాహెబ్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. చౌటుప్పల్‌లో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నిరసన కార్యక్రమానికి తరలివచ్చారు. 'రైతులకు బేడీలు సిగ్గు సిగ్గు' అంటూ నినాదాలు చేస్తూ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఆలేరులో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ నేతలంతా అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అనంతరం స్థానికంగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. భువనగిరి అంబేద్కర్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం కొనసాగింది. పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. మునుగోడు, చండూరు, మర్రిగూడెం, త్రిపురారం, హాలియా మండలాల్లోనూ స్థానిక నేతలు అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. లగచర్ల రైతులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకుని భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రాల్లోనూ భారీ ఎత్తున పార్టీ శ్రేణులు నిరసన తెలిపాయి. గరిడేపల్లి మండలం కీతవారిగూడెం, నడిగూడెం, మోతె, తుంగతుర్తి మండలం గానుగబండలోనూ అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేస్తూ బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో లగచర్ల రైతులకు అండగా కదం తొక్కారు. యాదగిరిగుట్ట, తుర్కపల్లి, వలిగొండ, భూదాన్ పోచంపల్లి, అడ్డగూడూరు, గుండాల మండలం వెల్మజాల, ఆత్మకూర్(ఎం), రాజపేట మండలాల్లోనూ పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు నిరసన కార్యక్రమంలో పాల్గొని అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. లగచర్ల రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని, మానవీయ కోణంలో వారందరినీ బేషరతుగా జైలులో నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక చర్యలను మానుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



మిర్యాలగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు



కోదాడలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



సూర్యాపేటలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలుపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, నాయకులు

## పంచాయతీ కార్మికులపై నిర్బంధకాండ

- వేతనాల కోసం చలో అసెంబ్లీకి వెళ్లకుండా అరెస్టులు
- తెల్లవారుజాము నుంచే అదుపులోకి..
- స్టేషన్ల ఎదుట కార్మికుల నిరసన



కేతేపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో నిరసన తెలుపుతున్న గ్రామ పంచాయతీ కార్మికులు

నల్లగొండ ప్రతినిధి/ సూర్యాపేట, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ) : ప్రజా పోరాటాలు, ఉద్యమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని కొనసాగిస్తూనే ఉంది. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ వర్గం ఏ పిలుపునిచ్చినా వెంటనే పోలీసులను రంగంలోకి దింపి నిర్బంధకాండకు పాల్పడుతున్నది. ప్రజాస్వామ్య పాలన అంటూ గొప్పలు చెప్తూ ఆచరణలో మాత్రం ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతున్నది. సమస్యల పరిష్కారం కోసం కొంతకాలంగా ఆందోళన చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు మంగళవారం చలో అసెంబ్లీకి పిలుపునివ్వగా, పోలీసుల ద్వా రా అడ్డుకున్నది. ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు, మల్టీపర్పస్ విధానం రద్దు వంటి డిమాండ్లతో మంగళవారం ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి అసెంబ్లీ ముట్టడికి సన్నద్ధమవగా, మంగళవారం తెల్లవారుజాము నుంచే పోలీసులు ఎక్కడికక్కడ ముం దస్తు అరెస్టులు చేశారు. నల్లగొండ జిల్లాలోని శాలిగౌరారం, త్రిపురారం, పెద్దవూర, మునుగోడు, నార్కట్‌పల్లి, కేతేపల్లి, చండూరు ఇలా దాదాపు అన్ని మండలాల్లోనూ అరెస్టుల పర్వం సాగింది. పోలీసుల చర్యలను ముందే ఊహించి పలు మండలాల నుంచి సోమవారం రాత్రే హైదరాబాద్‌కు చేరుకున్నవారూ ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో తెల్లవారుజామున 3 గంటల నుంచే పోలీసులు అరెస్టుల పర్వం కొనసాగించారు. దాంతో సూర్యాపేట రూరల్, గరిడేపల్లి, మోతె, పెన్‌పహాడ్, అర్వపల్లి, తుంగతుర్తి తదితర పోలీస్ స్టేషన్లన్నీ పంచాయతీ కార్మికులతో నిండిపోయాయి. యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగానూ అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి. గ్రామ పం చాయతీ పోలీస్ స్టేషన్ల ఎదుటే నిరసన తెలిపారు. ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. కార్మికుల పట్ల ప్రభు త్వ తీరు ను ఆ సంఘం నేతలు తీవ్రంగా ఖం డించా రు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు నెలకు రూ.1,500 వేతనాన్ని రూ.9 వేలకు పెంచడంతోపాటు ప్రతి నెలా పల్లె ప్రగతిలో భాగంగా ఇచ్చే నిధుల్లో తొలి దఫాగా వేతనాలు తీసుకోమని సూచించిందని, ఆ దిశ గా కార్మికులు ప్రతి నెలా వేతనాలు పొందేవారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి పల్లెలకు నిధు లు లేవని, కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని వాపోయారు. అనేక ఇబ్బందుల నడు మ వెట్టి చాకి రీ చేస్తున్న పంచాయతీ కార్మికులకు సకాలం లో వేతనాలు చెల్లించడంతోపా టు ఇతర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. సర్కారు సమస్యలు పరిష్కరించే వర కు తమ ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు.

## కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల మహా ధర్నా

నల్లగొండ, డిసెంబర్ 17 : సమస్యలు పరిష్కారం కోసం మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన కొనసాగుతున్నది. 48 గంటల మహాధర్నాలో భాగంగా రెండో రోజు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి హాజరై సంఘీభావం తెలిపి మాట్లారు. సర్కారు నిర్లక్ష్యంతో మధ్యాహ్న భోజన కార్మికులు అర్థాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో బిల్లులు రాకపోవడం వల్ల విద్యార్థులకు భోజనం అందించేందుకు అవసరమైన సరుకుల కోసం కార్మికులు అప్పులు చేసి వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులతో వారంలో రెండు గుడ్లు అందించడమే సాధ్యమవడం లేదని, మూడో గుడ్డు పెట్టాలంటే ప్రభుత్వమే నేరుగా పాఠశాలలకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రస్తుతం శ్రమకు తగ్గ ఫలితం అందలేలా నెలకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు పోలే సత్యనారాయణ, పెంజర్ల సైదులు, లక్కపాక రాజు, ఎస్‌కే ఖరీమున్నీసా, లక్ష్మమ్మ, హంస, అనూరాధ, సంగీత, అంజమ్మ పాల్గొన్నారు.




నల్లగొండ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులు